

మణుగూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా



మండలి చైర్మన్ చాంబర్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు తదితరులు



అశ్వారావుపేట: లగచర్ల రైతులపై అక్రమ కేసులు బనాయించడాన్ని, వారిని జైలు నుంచి విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ చేతికి సంకెళ్లతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు. చిత్రంలో మెచ్చా

# రాష్ట్రంలో రాక్షస పాలన

- లగచర్ల రైతులపై థర్డ్ డిగ్రీలు ప్రయోగిస్తారా?
- వాళ్లు ఏం తప్పు చేశారని సంకెళ్లు వేశారు?
- బెయిల్ ఇవ్వకుండా ఎన్నాళ్లు జైల్లో ఉంచుతారు?
- లగచర్ల రైతులపై ప్రభుత్వ తీరు పట్ల బీఆర్ఎస్ ఫైర్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శ్రేణుల ఆందోళనలు
- వాడవాడలా అంబేద్కర్ విగ్రహాలకు వినతులు
- పాల్గొన్న రేగా, సండ్ర, మెచ్చా, వనమా, హరిప్రియ
- 'పేట'లో చేతులకు బేడీలతో గులాబీ శ్రేణుల నిరసన

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ప్రజాపాలన పేరు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలకులు.. కర్షకులపై కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల రైతులు ఏం తప్పు చేశారని నెల రోజులుగా బెయిల్ ఇవ్వకుండా వారిని జైల్లోనే ఉంచి చిత్రహింసలు పెడుతున్నారని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబం కోసం చేస్తున్న భూసేకరణను అడ్డుకున్నందుకు, ఆయన సోదరులకు భూములు ఇవ్వనందుకే గిరిజన రైతులపై తప్పుడు కేసులు బనాయించారా?' అంటూ నిలదీశారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత వైఖరిని మార్చుకోకపోతే బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో స్పందిస్తుందని స్పష్టం చేశారు. గిరిజన రైతుల పక్షాన ఉద్యమించి కాంగ్రెస్ మెడలు వంచుతుందని హెచ్చరించారు. లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, వారిని వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు శ్రీకారం చుట్టాలన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు మంగళవారం స్పందించాయి. పార్టీ ఆదేశం మేరకు వాడవాడలా ఉన్న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించాయి.

ఈ సందర్భంగా మణుగూరు, ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, మధిర నియోజకవర్గాల్లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు మాట్లాడారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన అంటే గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడమా?' అని ప్రశ్నించారు. 'లగచర్ల రైతులేమైనా గజదొంగలా?' అంటూ నిలదీశారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న చేతికి సంకెళ్లు వేయడం.. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని దుయ్యబట్టారు. తమ కుటుంబానికి భూములివ్వబోమన్న లగచర్ల రైతులను జైలుకు పంపిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడ రైతుల థర్డ్ డిగ్రీని వీడియో కాల్‌లో చూస్తూ రాక్షసానందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ వారి తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. వారికి అండగా ఉంటుందని తేల్చిచెప్పారు. కాగా, అశ్వారావుపేటలో కొందరు బీఆర్ఎస్ నేతలు చేతులకు బేడీలతో నిరసన వ్యక్తం చేశారు. *–నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 17*



ఖమ్మంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సండ్ర, పగడాల తదితరులు



లగచర్ల రైతులను విడుదల చేయాలంటూ కొత్తగూడెంలో నినాదాలు చేస్తున్న వనమా



మధిరలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తూ నిరసన తెలుపుతున్న లింగాల



ఇల్లెందులో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, బీఆర్ఎస్ నాయకులు



ఖమ్మం రూరల్: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



భద్రాచలం: నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



సత్తుపల్లి టౌన్: అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు



ములకలపల్లి: రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు



ఖమ్మం ఎడ్యుకేషన్: ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న ఎంఈవోలు

## ఎనిమిదో రోజుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

### కొత్తగూడెంలో మోకాళ్లపై నిల్చొని చెవిలో పూలతో నిరసన

ఖమ్మం ఎడ్యుకేషన్/ కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 17: సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులను బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని టీఎస్‌సీపీఎస్ఈయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్, మినిమం పే స్కేల్ డిమాండ్లపై చేస్తున్న సమ్మెలో భాగంగా ఖమ్మం కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు కొనసాగిస్తున్న నిరసన మంగళవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా శశిధర్ మద్దతు తెలిపి మాట్లాడారు. కాగా, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్ష మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట మోకాళ్ల నిలబడి, చెవిలో పూలు పెట్టుకొని ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరసన తెలిపారు.





కొత్తగూడెం ఎడ్యుకేషన్: చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

## గురుకులాలపై నిర్లక్ష్యం..

# విద్యార్థులకు ప్రాణసంకటం

### (రెసిడెన్షియల్ స్కూళ్లా? 'రేబిస్'కు నిలయాలా?)

- ఖమ్మంలో గత నెలలో ఓ విద్యార్థినిని పదకొండు సార్లు కొరికిన ఎలుకలు
- టీకా వేయించి చేతులు దులుపుకున్న సంక్షేమ వసతిగృహ బాధ్యులు
- వ్యాక్సిన్లు వికటించి ప్రాణాపాయ స్థితికి టెన్త్ విద్యార్థిని కీర్తి
- వారం రోజుల చికిత్స అనంతరం కోలుకుంటున్న బాలిక

ఖమ్మం, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గురుకులాలపై అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిల్లోని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఓవైపు ఫుడ్ పాయిజన్లతో ప్రాణాలు కోల్పోతున్న గురుకులాల విద్యార్థుల సంఖ్య పెరుగుతుండగానే.. మరోవైపు ఎలుకలు కొరకడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్న విద్యార్థుల సంఖ్య వెలుగులోకి వస్తోంది. ఇలాంటి ఘటనలు బయటకు రాకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నప్పటికీ ఇటీవల ఎలుకలు కొరికిన కారణంగా ఓ విద్యార్థిని ప్రాణాపాయ స్థితికి చేరిన ఘటన ఖమ్మంలో ఆలస్యంగా వెలుగుచూసింది. తన కుమార్తె ప్రాణాపాయ స్థితిని చూసి తట్టుకోలేని ఓ తల్లి అసలు విషయాన్ని మీడియా ముందుకు తెచ్చింది. గురుకుల అధికారుల నిర్లక్ష్యం కారణంగా మిగతా పిల్లలెవరికీ తన కుమార్తె లాంటి పరిస్థితి రాకూడదంటూ వేదనను వెలిబుచ్చింది.

ఖమ్మం ముస్తాఫానగర్‌కు చెందిన సముద్రాల లక్ష్మీ భవానీ కీర్తి రఘునాథపాలెం మండలం దానవాయిగూడెం బీసీ గురుకుల బాలికల సంక్షేమ వసతిగృహంలో పదో తరగతి చదువుతోంది. గత నెల (నవంబర్)లో హాస్టల్లో రాత్రి



చికిత్స పొందుతున్న విద్యార్థిని కీర్తిని పరామర్శిస్తున్న సండ్ర

వేళ నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు కరవడంతో ఈ తీవ్రంగా గాయపడింది. మరునాడే ఈ విషయాన్ని హాస్టల్ బాధ్యులకు తెలియజేసింది. ఎలుకలు కొరికిన ఆనవాళ్లను గుర్తించిన నిర్వాహకులు.. విషయాన్ని గోప్యంగా ఉంచారు. విద్యార్థినిని రహస్యంగా తీసుకెళ్లి ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో రేబిస్ టీకా వేయించారు. వారం రోజుల క్రితం విద్యార్థిని కీర్తి.. తన తల్లికి ఫోన్ చేసింది. తన కాళ్లూ చేతులూ లాగుతున్నాయంటూ తెలియజేసింది. ఆందోళనకు గురైన తల్లి వెంటనే హాస్టల్‌కు చేరుకొని తక్షణమే నగరంలోని మమత ఆసుపత్రికి తీసుకెళ్లింది. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు.. 'ఎలుకలు కొరకడం వల్ల నరాలు చచ్చుబడ్డాయి. అందుకే కాళ్లూ చేతులకు స్పర్శ ఉండడం లేదు.' అని తేల్చారు. రెండు రోజులకు కీర్తి ఆరోగ్యం మరికొంత విషమించింది. వెంటనే విద్యార్థిని తల్లి.. ఈ విషయాన్ని హాస్టల్ నిర్వాహకులకు చెప్పింది. 'ఎలుకలు కొరికిన వెంటనే రేబిస్ టీకా వేయించాం. ఇక మాకేమీ సంబంధం లేదు' అంటూ చెప్పి వారు తప్పించుకున్నారు. కాగా, వారం రోజులుగా చికిత్స పొందుతున్న బాలిక ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది.

### పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు..

కాగా, ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక కీర్తిని బీఆర్ఎస్ నేతలు మంగళవారం పరామర్శించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య.. సదరు బాలికతోనూ, ఆమె తల్లితోనూ మాట్లాడి ఘటన వివరాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల వద్ద ఆరా తీశారు. అనంతరం ఆసుప్రతి వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం.. నిరుపేదలు చదువుతున్న గురుకులాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎలుకలు కరిచాయని తాను చెబితే హాస్టల్ అధికారులు 15 సార్లు వ్యాక్సిన్ వేయించారని విద్యార్థిని చెబుతోందని అన్నారు. అవి వికటించడం వల్లనే ఆమె ప్రాణాపాయ స్థితికి వచ్చినట్లు వైద్యులు చెబుతున్నారని అన్నారు. విద్యార్థినిని పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నేతలు బొమ్మెర రామ్మూర్తి, పగడాల నాగరాజు, ఉబ్బలపల్లి నిరోషా తదితరులు ఉన్నారు.

### ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే: ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, డిసెంబర్ 17: ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఖమ్మం గురుకుల విద్యార్థిని కీర్తికి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. ఎలుకలు కరవడంతో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమించి చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న వద్దిరాజు.. మంగళవారం ఢిల్లీ నుంచి ఫోన్ చేసి బాలిక ఆరోగ్యం గురించి ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బాధితురాలికి మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు.

### విచారణకు కలెక్టర్ ఆదేశం

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 17: దానవాయిగూడెం బీసీ బాలికల గురుకులంలో టెన్త్ విద్యార్థినిని ఎలుకలు కరిచిన విషయంపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విచారణకు ఆదేశించారు. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఫిర్యాదు మేరకు కలెక్టర్ స్పందించారు. విచారణ చేసి పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి మాధవిని ఆదేశించారు. ఈ మేరకు స్వయంగా హాస్టల్‌ను సందర్శించిన జిల్లా ఉపాధి కల్పనాధికారి.. ఈ ఘటనపై ఆరా తీశారు. ప్రత్యేకంగా కొందరు విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎలుకలు సంచరిస్తున్నాయని, తమలో కొందరిని కరిచాయని, టీకాలు తీసుకున్నామని పలువురు విద్యార్థినులు విచారణాధికారికి వివరించారు. అంతేగాక, శాఖాపరమైన నివేదికను అందజేయాలని ఖమ్మం జిల్లా ఆర్‌సీవో బ్యూలారాణి, డీసీవో జ్యోతిర్మయిలను బీసీ గురుకులాల సెక్రటరీ సైదయ్య ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌సీవో కూడా తన నివేదికను అందజేశారు.